
సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



ఉర్సుకు వేళాయే..
అర్వపల్లిలోని హజ్రత్ సయ్యద్ ఖాజా నసీరుద్దీన్‌బాబా దర్గా ఉర్సు శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది.
- 8లో



ఆదాయం రూ.2.38 కోట్లు
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి హుండీల ద్వారా రూ.2,38,46,282 ఆదాయం సమకూరింది.
- 8లో



అధ్వానంగా సర్వీస్ రోడ్లు
చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి.
- 9లో

డబుల్ మినిస్టర్స్

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు మంత్రి పదవులు

సీఎం రేవంత్‌తో పాటు ప్రమాణ స్వీకారం

- కొత్త మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం
- ఇద్దరికీ గతంలో మంత్రులుగా పనిచేసిన అనుభవం
- ఎమ్మెల్యేలుగా ఐదారుసార్లు గెలిచిన నేతలు





మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కేబినెట్‌లో పెద్ద పీట వేశారు. గురువారం కొలువుదీరిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేబినెట్‌లోకి ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ నాయకులైన నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తీసుకున్నారు. రేవంత్‌రెడ్డితో పాటు వారిద్దరూ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. త్వరలోనే వారికి ప్రభుత్వం శాఖలను కేటాయించనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంలో నల్లగొండ జిల్లాలో ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. ఇప్పుడు 14 ఏళ్ల తరువాత ఇద్దరు అమాత్యులయ్యారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో కుందూరు జానారెడ్డి హోం మంత్రిగా, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఐటీ శాఖ మంత్రిగా ఉన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు సార్లు బీఆర్‌ఎస్ పార్టీ అధికారం చేపట్టింది. ఆ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు ఒకే మంత్రి పదవి లభించింది. గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఒక్కరే రెండు ప్రభుత్వాల్లోనూ విద్యాశాఖ, విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం తెలంగాణ రెండో ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో మళ్లీ జిల్లాకు పెద్దపీట వేశారు. సీనియర్ నేతలు ఇద్దరికి ప్రస్తుత కేబినెట్‌లో మంత్రులుగా అవకాశం దక్కింది.





ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం రేవంత్‌ను ఆలింగనం చేసుకుంటున్న వెంకట్‌రెడ్డి, ఉత్తమ్

త్యాగానికి దక్కిన గౌరవం!

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో, యువత ఆత్మ బలిదానాలు చేసుకుంటున్న తరుణంలో మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. 'బలిదానాలు చేసుకోవద్దు అవసరమైతే మా పదవులను త్యాగం చేసి ప్రభుత్వంపై పోరాడుతాం' అని విద్యార్థుల్లో ధైర్యం నింపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఆవశ్యకతను పలుమార్లు కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి, సోనియా గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్ర నేతలు అడ్డుపడుతూ తెలంగాణ ప్రక్రియను ముందుకుసాగనివ్వని పరిస్థితుల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. అదే సమయంలో నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో 9 రోజులు నిరాహార దీక్ష చేశారు. ఆ తరువాత కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణను ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ పార్టీ అధికారం చేపట్టింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆనాడు తెలంగాణ కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మళ్లీ మంత్రి పదవి లభించింది. తెలంగాణ ఉద్యమమే కాదు.. 1999లో మొదటిసారి నల్లగొండ ఎమ్మెల్యేగా గెలుపొందినప్పుడు నల్లగొండ పట్టణానికి ఫ్లోరైడ్ రహిత నీరు అందించాలని 11 రోజులు నిరాహార దీక్ష చేశారు. ఆ తరువాత ప్రభుత్వం కృష్ణా జలాల సరఫరా ప్రక్రియను ప్రారంభించింది. పానగల్ ఉదయ సముద్రం నుంచి నల్లగొండ పట్టణానికి తాగునీరు అందించే ప్రాజెక్టు మంజూరైంది. 2005లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని ఒప్పించి ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గాన్ని మంజూరు చేయించారు.

సేవకు గుర్తింపు

ఎయిర్ ఫోర్స్‌లో ఫ్రంట్‌లైన్ ఫైటర్ స్క్వాడ్రన్ వింగ్‌లో మిగ్–21, మిగ్–23 విమానాలను నడిపిన కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనేక సంవత్సరాలు దేశానికి సేవలందించారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రతిష్టాత్మకమైన కంట్రోల్ ఆఫ్ సెక్యూరిటీ, ప్రొటోకాల్, అడ్మినిస్ట్రేషన్ ఉద్యోగం చేశారు. 1994లో ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ తరువాత ఎమ్మెల్యేగా ఐదుసార్లు గెలిచారు. ఇప్పుడు ఆరోసారి విజయం సాధించారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎక్స్‌సర్వీస్‌మెన్ సెల్ చైర్మన్‌గా, మాజీ సైనికుల పునరావాస కమిటీ సభ్యుడిగా సేవలందించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సమస్యపై కేంద్ర హోంమంత్రి నిర్వహించిన అఖిలపక్ష సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించారు. 2019లో నల్లగొండ ఎంపీగా గెలుపొందారు. ఆయనతోపాటు ఆయన సతీమణి పద్మావతిరెడ్డి కూడా ప్రజా సేవలో నిమగ్నమయ్యారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అందించిన సేవలకు ఫలితం దక్కింది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో గృహనిర్మాణ శాఖ మంత్రిగా పనిచేసిన ఉత్తమ్‌ను మరోసారి మంత్రి పదవి వరించింది.

న్యూస్‌రీల్

9 నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు



క్రీడా పోటీలకు ముస్తాబైన రాజాపేటలోని గురుకుల పాఠశాల

రాజాపేట : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల తొమ్మిదవ రాష్ట్ర స్థాయి క్రీడా (బాలురు) పోటీలు ఈనెల 9నుంచి రాజాపేటలోని గురుకుల పాఠశాలలో ప్రారంభం కానున్నాయి. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, టెనికాయిట్, క్యారమ్స్, చెస్‌లో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 7 జోన్ల నుంచి 1,171 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటారని యాదాద్రి రీజిన్ ఆర్‌సీఓ, క్రీడల ఓవరాల్ ఇన్‌చార్జి శ్రీమతి రజనీ తెలిపారు. క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలో గల మోడల్ స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేయడానికి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఈడీ లేదా ఎంపీఈడీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని కోరారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. పూజల్లో భాగంగా స్వామి, అమ్మవారి నిత్యకల్యాణ వేడుకను పండుగగా నిర్వహించారు. అంతకు ముందు వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన తదితర పూజలు గావించారు. అలాగే ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. సాయంత్రం జోడు సేవలను ఆలయ మాఢ వీధిలో ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మహిళలు, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించే రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారిత అవార్డు- 2023కి దివ్యాంగులు, దివ్యాంగుల కోసం పని చేస్తున్న సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ఉద్యోగి, ఉత్తమ స్వయం ఉద్యోగి, ఉత్తమ వ్యక్తిగత సామాజిక కార్యకర్త, ఉత్తమ క్రీడా వ్యక్తి, సంస్థ/ఎన్‌జీఓ, ఉత్తమ యజమాని, ప్రభుత్వ శాఖల్లో దివ్యాంగులకు అందుబాటులో ఉండే ఉత్తమ విభాగం, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ దివ్యాంగుల కేటగిరీ వారీగా అవార్డులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

11న చెస్ జిల్లా జట్ల ఎంపిక

నల్లగొండ టూటౌన్: ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్ 19 బాలబాలికల చెస్ జిల్లా జట్ల ఎంపికను 11వ తేదీన నల్లగొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి (అండర్ 19) ఇందిర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 11న ఉదయం 10 గంటలకు బోనఫైడ్, ఇంటర్ వారైతే 10వ తరగతి మెమోతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కరుణాకర్‌రెడ్డి 99854 23823 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రపతి పర్యటనకు సిద్ధమవుతున్న పోచంపల్లి

- బాలాజీ ఫంక్షన్ హాల్, చేనేత సహకార సంఘం, గ్రామీణ పర్యాటక కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు



బాలాజీ ఫంక్షన్ హాల్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, చేనేత, జౌళి శాఖ అధికారులు

భూదాన్‌పోచంపల్లి : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 20న భూదాన్‌పోచంపల్లికి రానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, వీవర్స్ సర్వీస్ సెంటర్ రీజినల్ ఆఫీస్ ఆఫ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ హ్యాండ్లూమ్స్ అరుణ్‌కుమార్, చేనేత, జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్ పోచంపల్లిలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌ను సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. శీతాకాల విడిదిలో భాగంగా ఈ నెల 18న హైదరాబాద్‌కు రాష్ట్రపతి వస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే భూదాన్‌పోచంపల్లిలో 20వ తేదీన ఉదయం 11.10 నుంచి మధ్యాహ్నం 12.10 వరకు రాష్ట్రపతి పర్యటన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించనున్నారని, పద్మశ్రీ, సంత్ కబీర్, జాతీయ అవార్డు గ్రహీతలతో కూడా మాట్లాడుతారని చెప్పారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవార్డులు వచ్చిన 16మందిని గుర్తించి వారి జాబితాను ఢిల్లీకి పంపించామని, అందులో ఎంపిక చేసిన ఐదు నుంచి 10 మందితో రాష్ట్రపతి ప్రత్యేకంగా మాట్లాడనున్నారని వెల్లడించారు.

చేనేత ఔన్నత్యం ప్రతిబింబించేలా..

తెలంగాణ చేనేత ఔన్నత్యం ప్రతిబింబించే విధంగా థీమ్ పెవిలియన్ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ముఖ్యంగా పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తేలియా రుమాళ్లు, ముచ్చంపేట చీరలు, నారాయణపేట చీరలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, గద్వాల చీరల ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు చేనేత మగ్గాల ప్రదర్శన ఉంటుందని అరుణ్‌కుమార్ తెలిపారు. అనంతరం చేనేత సహకార సంఘం, గ్రామీణ పర్యాటక కేంద్రాన్ని వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరాబాయి, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, చేనేత టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్, చేనేత నాయకులు ఎన్నం శివకుమార్, భారత లవకుమార్, సీత దామోదర్, పాలాది యాదగిరి పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు మరో చాన్స్

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సవరణ
- జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- జనవరి 6న ముసాయిదా, ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటన



భువనగిరి : భారత ఎన్నికల సంఘం ఏటా ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ ప్రకటిస్తోంది. తాజాగా జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా పలుమార్లు సవరణకు అవకాశమిచ్చింది. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అక్టోబర్‌లో తుది జాబితా ప్రకటించగా నవంబర్ రెండో వారంలో అనుసంధానం జాబితా ఇచ్చింది. ఆ ప్రకారమే శాసనసభ ఎన్నికలు నిర్వహించింది. వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికలు ఉండటంతో జాబితా సవరణకు ఎన్నికల సంఘం మళ్లీ ప్రణాళిక విడుదల చేసింది.

మొదలైన కసరత్తు

ఓటరు జాబితా సవరణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ నెల 20 నుంచి బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి కొత్త దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ ప్రక్రియ 2024 జనవరి 5వ తేదీ వరకు కొనసాగనుంది. ఇదే నెల 6న ముసాయిదా జాబితా ప్రకటించి 22 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. బీఎల్‌ఓలు మరోసారి సర్వే చేసి అభ్యంతరాలు పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 2న జాబితాను పరిశీలించి ఇదే నెల 8వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు.

రెండు రోజులు బూత్‌స్థాయిలో నమోదు

జాబితా సరవణలో భాగంగా పోలింగ్ బూత్ స్థాయిలో శని, ఆదివారాలు ప్రత్యేకంగా ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నారు. జనవరిలో ఇది జరగనుండగా ఎన్నికల సంఘం త్వరలో తేదీలను ప్రకటించే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో కొత్తగా ఓటరు నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపు కోసం దరఖాస్తులను బీఎల్‌ఓలకు అందజేయవలిసి ఉంటుంది.

అర్హులు ఎవరంటే..

జాబితాలో పేరు లేని వారు, 2024 జనవరి 1నాటికి 18 ఏళ్ల వయస్సు నిండిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో లేదా బూత్ లెవల్ ఆఫీసర్ల వద్ద ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

నెలాఖరుకు సీఎంఆర్ పూర్తి చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్, పాల్గొన్న రైస్ మిల్లర్లు

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సాక్షి,యాదాద్రి : 2022–23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ లక్ష్యాన్ని ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే మిల్లర్లను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌లో హాల్‌లో రైస్ మిల్లర్లతో సమావేశమై కస్టమ్ మిల్లింగ్ రైస్‌పై సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు పూర్తయిన సీఎంఆర్, ఇంకా పెండింగ్ వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో 44 మిల్లులకు ఒక లక్ష 91 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా లక్షా 65వేల మెట్రిక్ టన్నులు పూర్తయినట్లు తెలిపారు. 84 శాతం లక్ష్యం సాధించామని.. ఈనెల చివరిలోపు నూరు శాతం చేరుకోవాలని కోరారు. వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులు, మిల్లర్లకు సూచించారు. ఇప్పటివరకు 2 లక్షల 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 20, 800 మంది రైతుల ఖాతాల్లో రూ.430 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి వెంకటేష్ పాల్గొన్నారు.

నీలగిరి మున్సిపల్ కమిషనర్ రాజీనామా

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణాచారి గురువారం తన పదవికి రాజీనామా చేశారు. సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా, సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్న రిటైర్డ్ ఉద్యోగి రమణాచారిని నీలగిరి పట్టణ అభివృద్ధి, సుందరీకరణ కోసం మున్సిపల్ కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే. నీలగిరి పట్టణ సుందరీకరణలో ఆయన కీలకపాత్ర పోషించారు. కేసీఆర్ మనిషిగా ముద్ర పడిన రమణాచారి నీలగిరి మున్సిపల్ కమిషనర్‌గా దాదాపు రెండేళ్లు పనిచేశారు. నూతన కమిషనర్‌గా కందుకూరి వెంకటేశ్వర్లును నియమిస్తూ నల్లగొండ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

12 నుంచి గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె



సమావేశంలో పాల్గొన్న తపాలా ఉద్యోగులు

గరిడేపల్లి: డిమాండ్ల సాధనకోసం ఈ నెల 12నుంచి గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు పోస్టల్ ఉద్యోగుల జేఏసీ సూర్యాపేట జిల్లా కన్వీనర్ నాగరాజు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలోని సబ్ పోస్టాఫీస్ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన సమ్మె సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా పనిభారం పెంచి ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. కమలేష్ చంద్ర కమిటీలో ఉన్న సానుకూల సిఫారసులను అమలు చేయడంతో పాటు ఎనిమిది గంటల పని దినాలు అమలు చేయాలన్నారు. పెన్షన్‌తో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, సీనియర్ ఉద్యోగులకు 12, 24, 36 ఇంక్రిమెంట్, గ్రాట్యుటీ ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్‌ను రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీపీఎం, ఏబీపీఎంలు చంద్రయ్య, బలరాం, రాము, రాంబాబు, శ్రీయాంక, అంజయ్య పాల్గొన్నారు.

'సమర్థ్'ను సద్వినియోగం చేసుకోవాలి

- వీవర్స్ సర్వీస్ సెంటర్ ఏడీ పుగలేంది



చేనేత కార్మికులకు సామగ్రి అందజేస్తున్న ఏడీ

భూదాన్‌పోచంపల్లి : చేనేత కార్మికుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉద్దేశించిన సమర్థ్ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన వీవర్స్ సర్వీస్ సెంటర్ ఏడీ పుగలేంది కోరారు. గురువారం భూదాన్‌పోచంపల్లిలో డీఎస్‌ఆర్ వీవ్స్‌లో కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కమిషనర్, హైదరాబాద్ వీవర్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో సమర్థ్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేనేత కార్మికులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేనేత వృత్తి మానేసిన కార్మికులు, కొత్తగా వచ్చిన కార్మికులకు సమర్థ్ ప్రోగ్రామం కింద మగ్గం, డైయింగ్, డిజైనింగ్‌లో 40 రోజుల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.300 చొప్పున ఉపకారవేతనం కూడా చెల్లిస్తారని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత కార్మికులకు 90శాతం సబ్సిడీతో చేనేత పరికరాలు, ఫ్రేమ్ మగ్గం, ఆసుయంత్రం, డాబీలు, వర్క్‌షెడ్ రుణం అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీవర్స్ సర్వీస్ సెంటర్ అధికారులు పవన్‌కుమార్, బాలాజీ, డీఎస్‌ఆర్ వీవ్స్ యజమాని దోర్నాల శేషగిరి పాల్గొన్నారు.

ఖాళీ స్థలం.. దోమలకు నిలయం

- డంపింగ్ యార్డులుగా ఓపెన్ ప్లాట్లు
- కొరవడిన పారిశుద్ధ్య చర్యలు
- ప్రమాదంలో ప్రజారోగ్యం



భువనగిరిలోని ఖిల్లానగర్‌లో మురుగు నీరు, పిచ్చిమొక్కలతో నిండిన ఖాళీ ప్రదేశం



పహాడీనగర్‌లో చెత్త, పిచ్చి మొక్కలతో నిండిన ఖాళీ ప్లాట్

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పట్టణవాసులు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో వేస్తుండడం ఈ దుస్థితికి కారణమవుతోంది. మున్సిపాలిటీ వాహనాలకు బదులుగా ఖాళీ జాగలను డంపింగ్ యార్డులుగా మారుస్తున్నారు. దీనికి తోడు పిచ్చిమొక్కలు పెరిగి, వర్షపు నీరు చేరడంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. పట్టణంలోని చాలా కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొన్నా పారిశుద్ధ చర్యలు చేపట్టడంలో అధికారులు చోద్యం చూస్తున్నారు.

250 వరకు ఖాళీ ప్లాట్‌లు

పట్టణంలో 250 వరకు ఖాళీ ప్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నూతన పురపాలక చట్టం–2019 ప్రకారం ఖాళీ స్థలాలు కలిగిన యజమానులకు మున్సిపాల్ శాఖ అధికారులు పన్ను విధించడంతో పాటు ఆ స్థలాలను అపరిశుభ్రంగా వదిలేస్తే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకునే అధికారం ఉంది. కానీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

ఈ ప్రాంతాల్లో సమస్య అధికం

భువనగిరి మున్సిపాలిటీలో పరిధిలో 35 వార్డులు ఉన్నాయి. 70 వేల వరకు జనాభా ఉంటుంది. ముఖ్యంగా బంజారాహిల్స్, పహాడీనగర్, ఏరియా ఆసుపత్రి వెనుకాల, ఖిలానగర్, మీనానగర్‌తో పాటు సింగన్నగూడెం, ఇందిరమ్మకాలనీ, హన్మాన్‌వాడ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడద విపరీతంగా ఉంది. వ్యాధులబారిన పడుతున్నామని, వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

దోమల బెడద ఎక్కువగా ఉంది



ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయడం ద్వారా డంపింగ్ యార్డుల్లా మారాయి. దీనికి తోడు వర్షపు నీరు కూడా చేరడంతో దుర్వాసన వస్తుంది. దోమలు ఎక్కువగా ఉన్నాయి. కొంతకాలంగా పారిశుద్ధ్య చర్యలు కూడా సరిగా లేవు. ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేయించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

–ఏజాజ్, భువనగిరి

నోటీసులు జారీ చేస్తాం



ఎన్నికల నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణపై కొంత నిర్లక్ష్యం జరిగింది. ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేయిస్తాం. ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం.ప్లాట్లను శుభ్రం చేసుకునేందుకు కొంత గడువు ఇస్తాం. శుభ్రం చేయని పక్షంలో చర్యలు తీసుకుంటాం.

–నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

క్లుప్తంగా

ఎదురెదురుగా బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

వలిగొండ : ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని గొల్లపల్లి స్టేజి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ (ఎం) మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన కన్నెబోయిన రాజు తన ద్విచక్రవాహనంపై పనినిమిత్తం చౌటుప్పల్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. అదే క్రమంలో వలిగొండకు చెందిన ఎండీ సలావుద్దీన్ తన ద్విచక్రవాహనంపై వలిగొండ నుంచి గోకారం వెళ్తున్నాడు. వారు గొల్లెపల్లి, నెమిలకాల్వ స్టేజీల సమీపంలోకి రాగానే రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు గమనించి వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో రాజును వలిగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, సలావుద్దీన్‌ను భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది వెల్లడించారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

గుర్రంపోడు : అప్పుల భారం పెరగడంతో మనస్థాపం చెంది ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని తేనపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్తగొల్ల యాదమ్మ(35) వ్యవసాయంలో చేసిన అప్పులు ఏటేటా పెరుగుతుండడంతో మనస్థాపంతో బుధవారం సాయంత్రం వ్యవసాయబావి వద్ద పురుగుల మందు తాగింది. గమనించిన భర్త ధనయ్య, కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి మీనయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

చివ్వెంల(సూర్యాపేట) : చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధించారు. అందుకు సంబంధించి గురువారం సూర్యాపేట జిల్లా కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్ తీర్పు వెలువరించారు. వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండల పాతర్ల పహాడ్ గ్రామానికి చెందిన కట్టా దయాకర్ వద్ద, నడిగూడెం మండలం కోడిపుంజులగూడెం గ్రామానికి చెందిన చల్లా రాజశేఖర్ 2017లో రూ.75వేలు, 2018లో రూ.3లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించే క్రమంలో రూ.4.45లక్షలకు చెక్కు రాసి ఇచ్చాడు. దీంతో దయాకర్ చెక్కు మార్పిడి కోసం బ్యాంక్‌కు వెళ్లాడు. చెక్కు ఇచ్చిన రాజశేఖర్ అకౌంట్‌లో డబ్బులు లేకపోవడంతో దయాకర్ కోర్టును ఆశ్రయించాడు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి చల్లా రాజశేఖర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.9లక్షలు బాధితుడు దయాకర్‌కు చెల్లించాలని తీర్పు వెల్లడించారు.

క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూపు

- చాలీచాలని వేతనాలతో పంచాయతీ కార్మికులు సతమతం
- పనికి తగిన వేతనం లేదు..
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో 7362 మంది విధులు నిర్వహణ



వీధుల్లోని చెత్తను ట్రాక్టర్‌లోకి ఎత్తుతున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

హుజూర్‌నగర్ : గ్రామ పాలనలో గ్రామ పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకం. వారు పల్లెల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో సేవలందిస్తారు. కానీ ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా వారికి వేతనాలు మాత్రం మారడం లేదు. నెలకు రూ.9,500ల చాలీచాలని వేతనాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. ఈ జీతంతో కొన్నేళ్లుగా పంచాయతీల్లో పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం దయచూపి ఆదుకోవాలని కార్మికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 7362మంది కార్మికులు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 8 రెవెన్యూ డివిజన్లు, 12అసెంబ్లీ నియోజకవర్గాలు, 72మండలాలు, 1740గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటిలో దాదాపు 7362మంది మల్టీపర్పస్ వర్కర్లు పనిచేస్తున్నారు. వారిలో కొంత మంది 15ఏళ్లకు పైబడి కారోబార్లు, ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, పారిశుద్ధ్య కార్మికులు తదితర పనులు చేస్తున్నారు. అయితే ఆయా గ్రామాల్లో పన్నులు, బిల్లుల వసూళ్ల ఆధారంగా నెలకు వారికి రూ.9,500ల వేతనం చెల్లిస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తుందన్న ఆశతోనే నిత్య క్రమం తప్పకుండా, వత్తిడితో పనిచేస్తూ ఉద్యోగ భద్రత, కనీస వేతనాల కోసం ఏళ్లుగా ఉద్యమిస్తూనే ఉన్నారు. గ్రామంలో ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకవెళ్లడంతో పాటు ఏ అధికారి పర్యటనకు వచ్చినా, మరే చిన్న పనికైనా వారు అవసరం తప్పని పరిస్థితి. అదే విధంగా గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, నీటి సరఫరా, సంక్షేమ పథకాల అమలు, దరఖాస్తుల స్వీకరణ, గ్రామ స్థాయి, మండల స్థాయి నుంచి మండల పరిషత్‌కు కారోబార్లు వారధిగా పనిచేస్తున్నారు. కాని అందుకు సరిపడా వేతనం మాత్రం అందుకోవడం లేదు. రాష్ట్రం ఏర్పడ్డాక ప్రతి శాఖలో ప్రభుత్వం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించిందని, కాని తమవైపు మాత్రం కనికరం చూపడం లేదని వారు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు..

జిల్లా	మండలాలు	గ్రామ పంచాయతీలు	మల్టీపర్పస్ వర్కర్లు
నల్లగొండ	32	844	3222
సూర్యాపేట	23	475	1,890
యాదాద్రి భువనగిరి	17	421	2250

అర్హులైన వారిని క్రమబద్ధీకరించాలి



గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న చాలామందికి ఉద్యోగ భద్రత లేదు. 30ఏళ్లుగా విధుల్లో ఉన్నాం. వచ్చే వేతనం మాత్రం రూ.9,500 దాటడం లేదు. ఈ జీతాలు ప్రస్తుతం ఉన్న ఖర్చులకు కుటుంబానికి ఏమాత్రం సరిపోవడం లేదు. సమాన పనికి సమాన వేతనంతో నెలకు రూ.21వేలు చెల్లించాలి. నేటి కాలంలో రోజువారీ కూలీలకు సుమారు వెయ్యి రూపాయలు ఇస్తున్నారు. మా ఇబ్బందులను ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. కొత్త ప్రభుత్వమైనా స్పందించి అర్హులైన వారిని క్రమబద్ధీకరించి, మిగిలిన వారికి వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలి.

– పి.మల్లిఖార్జున్‌రావు, గ్రామపంచాయతీ వర్కర్ల సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి, మేళ్లచెరువు

హామీ ఇచ్చారు.. ఆచరణ మరిచారు..

మూడు నెలల కిత్రం పంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టారు. వారి సమ్మె ఉధృతంగా కొనసాగడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. అప్పటి ప్రభుత్వం దశలవారీగా కార్మిక సంఘాల నేతలు, కార్మికులతో చర్చలు జరిపి కొన్ని సమస్యలకు పరిష్కారం చూపింది. కార్మికుడు చనిపోతే దహన సంస్కారాలకు రూ.10వేలు పంచాయతీ నుంచి ఇవ్వాలని, రూ.5లక్షల బీమా వర్తించేలా చర్యలు తీసుకుంది. మరికొన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినా అవికాగితాలకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం స్పందించి పనికి తగిన వేతనం పెంచి తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు.

మధురం.. సీతా ఫలం

- శరీరానికి మేలు చేసే పోషకాలు పుష్కలం
- పేదవారి యాపిల్‌గా ప్రతీతి



తినడానికి సిద్ధంగా ఉన్న సీతాఫలాలు

హుజూర్‌నగర్ : ప్రకృతి అందించిన మధుర ఫల్లాలో సీతా ఫలం ఒకటి. పేదవారి యాపిల్‌గా ఇది పేరొందింది. సీజనల్‌గా లభించే ఈ ఫలంలో శరీరానికి మేలు చేసే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. సీతా ఫలాలు సెప్టెంబర్, డిసెంబర్ మధ్య కాలంలో మాత్రమే ఎక్కువగా లభిస్తాయి.

బరువు పెరగాలనుకుంటే..

సీతాఫలంలంలో మాంసకృత్తులు, పీచు, ఖనిజ లవణాలు, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్‌లు సీ, శరీరానికి శక్తినిచ్చే కొవ్వు పుష్కలంగా ఉంటాయి. జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. అంతే కాకుండా ఇందులో లభించే మెగ్నీషియం శరీర పనితీరును మెరుగు పరుస్తుంది. కండరాలకు విశ్రాంతి నివ్వడం, గుండె జబ్బుల నుంచి శరీరాన్ని కాపాడటంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ ఫలం సులువుగా జీర్ణం అవుతుంది. అందువల్ల ఈ పండ్లను చిన్నారుల నుంచి ముసలి వారి వరకు ఎంతో ఇష్టంగా తింటారు. వీటిని పాలల్లో కలిపి మిల్క్‌షేక్‌లా తీసుకుంటే ఎంతో రుచికరంగా ఉంటుంది. బరువు పెరగాలనుకునేవారు సీతా ఫలం తీసుకోవడం మేలని వైద్యులు సూచిస్తున్నారు.

పరిమాణం, రంగును బట్టి ధరలు

సీతాఫలాలకు సైజు, రంగును బట్టి ధరలు నిర్ణయిస్తారు. పెద్ద సైజు పండు ఒక్కొంటికి రూ. 20 నుంచి రూ. 30 వరకు, మధ్యస్తంగా ఉన్న పండు ఒక్కంటికి రూ .10 నుంచి రూ. 20 వరకు ధర, కాస్త పరిమాణం తక్కువగా ఉన్నవి రూ. 10 వరకు పలుకుతున్నాయి. వీటిని గంపగుత్తగా కూడా విక్రయిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల నుంచి సేకరించిన పండ్లను పట్టణాలకు తెచ్చి విక్రయిస్తుంటారు. తోటల నుంచి నేరుగా మార్కెట్‌కు తెచ్చిన పండ్లకు ధర ఎక్కువగా పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

శుభకార్యానికి వస్తూ.. అనంతలోకాలకు

- ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

నాంపల్లి : శుభకార్యానికి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రేఖ్యాతండా వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం గ్రామానికి చెందిన చింతోజు భరతాచారి(27) తన అత్తగారి ఊరైన పీఏపల్లి మండలంలోని గణపురం గ్రామానికి తన మరదలు ఎంగేజ్‌మెంట్‌కు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో భరతాచారి రేఖ్యాతండా వద్ద బస్సును ఓవ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



తేజస్విని (ఫైల్)

శాలిగౌరారం : కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని ఉప్పలంచ గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పలంచ గ్రామానికి చెందిన మాదాని తేజస్విని(23) ప్రైవేట్‌స్కూల్ టీచర్‌గా పనిచేస్తుంది. తేజస్విని నెలసరి సమయంలో వస్తున్న కడుపు నొప్పితో కొంతకాలంగా బాధపడుతుంది. ఈనెల 4న తీవ్రంగా కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొంత సమయం తర్వాత ఇంటికి వచ్చిన ఆమె భర్త మెల్విన్ తన భార్య నోటి నుంచి నురగలు వచ్చి కిందపడిపోయి ఉండటాన్ని గమనించి ఆమెను ద్విచక్రవాహనంపై నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించాడు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి తండ్రి పాలిశెట్టి బాలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. మృతురాలికి భర్త, 16నెలల కుమారుడు ఉన్నారు.

జాతీయ ఉత్తమ రైతు అవార్డుకు ఎంపిక




అవార్డు అందుకుంటున్న భూక్యా బీచ్చు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తల ప్రోత్సాహంతో వినూత్నంగా పంటలు సాగు చేస్తూ జాతీయ ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యాడు ఓ రైతు. వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం జలాల్‌పురం గ్రామానికి చెందిన రైతు భూక్య బీచ్చు వినూత్నంగా వ్యవసాయం చేస్తున్నందుకుగాను ఈనెల 6న న్యూఢిల్లీలో జరిగిన ఐసీఏఆర్ కృషి జాగరణ్ మేళాలో జాతీయ ఉత్తమ మిలియనీర్ రైతు అవార్డు వరించినట్లు కేవీకే ఇన్‌చార్జ్ ప్రోగ్రాం కోఆర్డి నేటర్ నరేష్ గురువారం తెలిపారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి కృషి జాగరణ్ సంయుక్తంగా ప్రతి సంవత్సరం మిలీనియం ఫార్మర్స్ మీట్ నిర్వహించి ఉత్తమ రైతులకు అవార్డులను అందజేస్తుంది. అందులో భాగంగా మిలీనియం ఫార్మర్స్ మీట్ – 2023 పేరిట ఈనెల 6నుంచి మూడు రోజుల పాటు ఢిల్లీలో జాతీయ మేళా నిర్వహించారు. ఈ మీట్‌లో తెలంగాణ నుంచి నలుగురు రైతులు అవార్డుకు ఎంపికయ్యారు. అందులో గడ్డిపల్లి కేవీకేకి చెందిన రైతు భూక్యా బీచ్చు ఒకరు. ఈ అవార్డు రావడం పట్ల గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సెక్రటరీ స్నేహలత, డైరెక్టర్స్, శాస్త్రవేత్తలు, సిబ్బంది తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నసీరుద్దీన్ బాబా ఉర్సుకు వేళాయే!

- నేటి నుంచి రెండు రోజుల పాటు ఉత్సవాలు
- మొదటి రోజు సాయంత్రం గంధం ఊరేగింపు
- శనివారం దీపారాధన
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



విద్యుత్‌కాంతుల వెలుగుల్లో దర్గా



ఉర్సుకు ముస్తాబైన బాబా సమాధి

అర్వపల్లి: తెలంగాణలో ప్రసిద్ధి గాంచి, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన అర్వపల్లి సమీపంలోని హజ్రత్ సయ్యద్ ఖాజానసీరుద్దీన్‌బాబా దర్గా ఉర్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఉత్సవాలు శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు జరగనున్నాయి. ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయం ప్రకారం శుక్రవారం సాయంత్రం 4గంటలకు అర్వపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి గంధం ఊరేగింపు మొదలవుతుంది. ఈ గంధం ఊరేగింపు రాత్రి 9గంటల వరకు దర్గాకు చేరుకుంటుంది. గంధం పాత్రలను ప్రజాప్రతినిధులు, పోలీస్, వక్ఫ్‌బోర్డుతో పాటు వివిధ శాఖల అధికారులు ఎత్తుకొని గ్రామ శివారు వరకు ఊరేగింపులో పాల్గొంటారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇదే రోజు రాత్రి హైదరాబాద్ డబుల్ పార్టీ వారిచే ఖవ్వాలీ కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని వేల సంఖ్యలో భక్తులు తిలకిస్తారు. అలాగే శనివారం సాయంత్రం దీపారాధన (చిరాగ్) కార్యక్రమం జరుగుతుందని దర్గా ముజావర్ సయ్యద్ అలీ తెలిపారు.

రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరానున్న భక్తులు

ఏడాదికోసారి అత్యంత వైభవంగా జరిగే ఉర్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ, ముస్లిం భక్తులు తరలిరానున్నారు. అయితే వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఉర్సుకు ఏర్పాట్లు చేపట్టారు. దర్గాను రంగురంగుల విద్యుత్ లైట్లతో ముస్తాబు చేశారు. దర్గా ఎదుట భక్తుల కోసం బారికేడ్లు ఏర్పాటు చేశారు. నీటి వసతి కల్పించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఉర్సుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు రాకుండా ఫార్మేషన్‌రోడ్డును తాత్కాలికంగా మరమ్మతు చేశారు. అలాగే దర్గాతో పాటు దర్గాకు వచ్చే రోడ్డు వెంట వరంగల్‌కు చెందిన మున్నా టెంట్‌హౌజ్, ఎలక్ట్రికల్, సౌండ్స్ అధినేత మున్నా లైట్లను స్వచ్ఛందంగా ఏర్పాటు చేశారు. ఉర్సు సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు తరలివచ్చి దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే ఉర్సు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, నాగారం సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో సూర్యాపేట సబ్‌డివిజన్ పరిధిలోని 75 మంది పోలీస్ సిబ్బంది, పలువురు ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్‌ఐ బి.అంజిరెడ్డి తెలిపారు. ఉర్సు ప్రశాంతంగా జరగడానికి భక్తులు, నిర్వాహకులు సహకరించాలని కోరారు.

హుండీ ఆదాయం రూ.2.38 కోట్లు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలు, వివిధల కానుకలను ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి సమక్షంలో ఆలయాధికారులు, సిబ్బంది గురువారం లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.2,38,46,282 నగదు వచ్చినట్లు ఈఓ గీతారెడ్డి వెల్లడించారు. అదే విధంగా 90గ్రాముల మిశ్రమ బంగారం, 3కిలోల 740గ్రాముల వెండి వచ్చినట్లు పేర్కొన్నారు. వాటితో పాటు వివిధ దేశాలకు సంబంధించిన కరెన్సీ సైతం వచ్చినట్లు తెలిపారు.



హుండీల్లో వచ్చిన నగదు, నగలును లెక్కిస్తున్న ఆలయాధికారులు, సిబ్బంది

ట్రాక్టర్ ట్రాలీల చోరీ

శాలిగౌరారం : ట్రాక్టర్ ట్రాలీలు చోరీకి గురైన ఘటన మండలంలోని శాలిలింగోటంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతులు కన్నెబోయిన గంగరాజు, బండారు సైదులుకు చెందిన రెండు ట్రాలీలను గ్రామ సమీపంలోని వారి వ్యవసాయ బావుల వద్ద ఉంచారు. దీంతో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు అపహరించారు. రోజు మాదిరిగా గురువారం ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లిన బాధితులు ట్రాక్టర్ ట్రాలీలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల రైతులు ఎవరైనా తమ అవసరాల కోసం తీసుకెళ్లారా అని ఆరా తీశారు. ఎవరు తీసుకుపోలేదని తెలవడంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీకి గురైన ట్రాలీలు శాలిలింగోటం–తుడిమిడి లింక్‌రోడ్డు మీదుగా తుడిమిడి వైపు తీసుకెళ్లినట్లు టైర్ల గుర్తులను బట్టీ గుర్తించారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్ ట్రాలీలే లక్ష్యంగా ఓ ముఠా పగటి పూట రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నట్లు యజమానులు అనుమానిస్తున్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు



క్రీడాకారులతో డీఈఓ భిక్షపతి

నల్లగొండ టూటౌన్ : నల్ల గొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు గురువారంతో ముగిశాయి. అండర్ 17, 19 విభాగాల బాల, బాలికల రాష్ట్ర స్థాయి పోటీల్లో వివిధ జిల్లాల నుంచి క్రీడాకారుల పాల్గొన్నారు. ఈ పోటీల్లో 45మంది క్రీడాకారులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో డీఈఓ భిక్షపతి, వాసుదేవరావు, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ అధికారి నిర్బంధం



నెమిల గ్రామపంచాయతీ కార్యాలయంలో బీపీఎంను నిర్బంధించిన పింఛన్‌దారులు

రాజాపేట : ఆసరా పింఛన్ల పంపిణీలో జాప్యం చేస్తున్నాడని ఓ పోస్టల్ అధికారిని పింఛన్‌దారులు గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. వివరాల ప్రకారం.. మండలంలోని నెమిల గ్రామంలో గతనెల 22న బయోమెట్రిక్ ద్వారా పెన్షన్‌దారులకు ఇవ్వాల్సిన పెన్షన్ నేటి వరకు ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన వృద్ధులు బీపీఎంను పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీఓ ఝాన్సీప్రకాష్‌రావు ఎంపీఓ దినకర్‌ను గ్రామానికి పంపి విచారణ జరిపించారు. గ్రామంలో 31మందికి బయోమెట్రిక్ ద్వారా రావాల్సిన పెన్షన్ 19మందికి మాత్రమే ఇచ్చారని, ఇంకా 12మందికి ఇవ్వాల్సి ఉండగా సదరు బీపీఎం ఇవ్వకుండా జ్యాపం చేస్తున్నాడని పింఛన్‌దారులు గ్రామానికి వచ్చిన ఎంపీఓకు ఫిర్యాదు చేశారు. ఆయన సంబంధిత అధికారులతో పాటు, బీపీఎంపై చర్యల కోసం జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు పెన్షన్‌దారులకు ఆయన హామీ ఇచ్చారు, దీంతో గ్రామంలో వివాదం సద్దుమనిగింది.

మహిళ దారుణ హత్య

- తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి సమీపంలో ఘటన
- పరిశీలించిన శాలి గౌరారం సీఐ రాఘవరావు, ఎస్‌ఐ ధర్మా
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీం



మంజుల (ఫైల్)



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాఘవరావు, ఎస్‌ఐ ధర్మా

రామగిరి(నల్లగొండ) : ఓ మహిళను దారుణంగా హత్య చేశారు గుర్తుతెలియని దుండగులు. ఈ సంఘటన తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన వల్లందాసు ఈదయ్య కూమార్తె మంజుల(34)కు ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన రవికుమార్‌తో వివాహం జరిగింది. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. మంజులకు ఆమె భర్తతో 7సంవత్సరాలుగా గొడవలు జరుగుతుండడంతో తల్లిగారి ఊరైన వెలుగుపల్లిలో ఉంటుంది. అయితే మంజుల రెండు నెలలుగా నల్లగొండలోని మెడికల్ కళాశాలలో వంటపని చేస్తోంది. బుధవారం మంజుల సోదరుడు బైక్‌పై ఆమెను నల్లగొండలో డ్యూటీ వద్ద వదలివెళ్లాడు. గురువారం ఉదయం అనిశెట్టి దుప్పలపల్లి నుంచి బసిరెడ్డిపల్లికి వెళ్లే దారిలో మంజుల గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో దారుణంగా హత్యకు గురైంది. ఉదయం ఈ ఘటనను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు..

స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు శాలిగౌరారం సీఐ రాఘవరావు, ఎస్సై ఎస్.ధర్మా హత్య జరిగిన చోటుకు చేరుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. మంజుల మెడకు చున్నీ బిగ్గరగా చుట్టి తలపై కొట్టడంతో మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. సంఘటన స్థలంలో లంచ్ బాక్సు, చెప్పులతో పాటు హత్యకు ఉపయోగించిన ఆటో జాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డెడ్‌బాడీ ఆచూకీ తెలియకపోవడంతో అనిశెట్టి దుప్పలపల్లి సెక్రటరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాట్సాప్ ద్వారా మృతదేహం గుర్తింపు..

హత్య జరిగిన వివరాలను, డెడ్‌బాడీ ఫొటోలను పోలీసులు చుట్టు పక్కల ఉన్న గ్రామాల వారి వాట్సాప్ గ్రూప్‌లకు పంపించారు. మధ్యాహ్నం వరకు కూడా వివరాలు తెలియలేదు. వెలుగుపల్లికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో ఫొటోలు రావడంతో మంజుల సోదరుడు ఆమె వేసుకున్న దుస్తులను గుర్తించి వెంటనే పోలీసులను సంప్రదించాడు.

మిస్టరీగా మిగిలిన హత్య..

మంజుల హత్య మిస్టరీగా మిగిలింది. సంఘటన స్థలంలో హత్యకు ఉపయోగించిన ఆటో జాకీ తప్ప పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. అదే విధంగా మంజుల ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అని వస్తోంది. హత్య జరగడానికి ముందు మంజుల ఎవరితో మాట్లాడింది అనే ఫోన్ సంభాషణ వివరాలను తీసేపనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఫోన్ సంభాషణ బయటకు వస్తే కేసు వీడనుంది.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడు మృతి

బొమ్మలరామారం : మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దూసరి వీరయ్య బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వీరయ్య తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. గొంగిడి సునీత ఎన్నికల్లో పరాజయం చెందడంతో పాటు రాష్ట్రంలో కేసీఆర్ అధికారం కోల్పోవడంతో కలత చెంది గుండెపోటుకు గురైనట్లు మృతుడి కుటుంబ సభ్యులు, నాయకులు తెలిపారు. వీరయ్య మృతదేహాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి సందర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.